# పంచాక్షరి

పంచాక్షరి అనగానే “ఓం నమఃశివాయ” అని అందరికి తెలుసును. ఈ కాలములో చాలామంది గురువులు ఈ పంచాక్షరినే ఉపదేశ మిచ్చుటకు ఉపయోగించుచున్నారు. చెవిలో చెప్పించుకొన్న పంచాక్షరి మంత్రమును చాలామంది జపము చేయుచుండుట కూడ గలదు. ఈ కాలములో అది గురూపదేశ మంత్రముగ ఉండగ, పూర్వము ఈ మంత్రమును చిన్న పిల్లలకు విద్యాభ్యాస ఆరంభములోనే మొట్టమొదటి చదువుగ బోధించెడివారు. మొదటి భాషా లిపి ప్రారంభములోనే అన్ని భాషలయందు ‘ఓం నమః శివాయ’ అన్న పదమును పలికించి వ్రాయించి మొదలు పెట్టెడివారు. అది కొంతకాలమునకు కొంతమారి పిల్లల విద్యాభ్యాస ప్రారంభములో ‘ఓం నమః శివాయః’ అని వ్రాయించబడెడిది. శివాయ పదమును శివాయః అని తప్పుగ వ్రాసెడివారు. కాని ఇపుడు అది కూడ పూర్తిగపోయి అ ఆ ఇ ఈ అను లిపి నుండి చదువును ప్రారంభించుచున్నారు. పూర్వము పంచాక్షరి మంత్రమును ‘ఓం నమః శివాయ’ అను లిపి అక్షరములతో ప్రారంభమైన చదువు నేడు అ ఆ ఇ ఈ లతో ప్రారంభము కావడము వలన పంచాక్షరి అంటే ఏమిటి? దానిని ఎందుకు పూర్వము పిల్లల చేత పలికించెడివారన్నది. ఇప్పటి కాలములో తెలియదన్నమాట.

**‘తెలిసివున్న దానిని తెలియకుండ మరచిపోవుట అందరివంతైతే ఆ తెలియని దానిని తెలుపుట ఒక్కనివంతు’** అను పెద్దల వాక్యము ప్రకారము, ఇపుడు ఆ ఒక్కని పాత్ర మేము నిర్వహిస్తు తెలియజేయడము ఏమనగ! ప్రతి ఆకు ఒక ఔషధమన్నట్లు, ప్రతి మాట కూడ ఒక మంత్రమగును. అందువలన ‘ఓం నమః శివాయ’ అను పదము కూడ ఒక మాటయే గనుక దానిని కూడ మంత్రము అన్నారు. ఇటువంటిదే ‘ఓం నమోనారాయణాయ’ అను మంత్రమును అష్టాక్షరీ మంత్రమని ‘ఓం నమః శివాయ’ అను మంత్రమును పంచాక్షరి మంత్రమని పేర్లు పెట్టారు. ఈ కాలములో అష్టాక్షరీ, పంచాక్షరీలను పేర్లతో కొందరంటున్న ఈ మంత్రముల గూర్చి ఎందుకా పేర్లు పెట్టారని మేము అడుగగ, ఈ కాలములో తెలిసిన వారనిపించుకొన్న కొందరు ‘ఓం నమః శివాయ ఐదక్షరములతో కూడుకొన్నది, కావున దానిని పంచాక్షరని, అట్లే ఓం నమోనారాయణాయ ఎనిమిది అక్షరములతో కూడుకొన్నది కావున అష్టాక్షరియని పిలుస్తున్నాము. శైవులు పంచాక్షరీ మంత్రమును, వైష్ణవులు అష్టాక్షరీ మంత్రమును ఉపదేశమిచ్చుచుందురని’ తెలిపారు.

పంచాక్షరి మంత్రమనగా ఐదక్షరముల మంత్రమని అనుటవలన దాని అక్షరములను లెక్కించగా అందు (1) ఓం (2) న (3) మః (4) శి (5) వా (6) య లను ఆరక్షరములు వచ్చును. కాని అష్టాక్షరి మంత్రమును లెక్కించితే (1) ఓం (2) న (3) మో (4) నా (5) రా (6) య (7) ణా (8) య అను ఎనిమిదక్షరములు సరిపోయినవి. దీనినిబట్టి చూస్తే పంచాక్షరిలో ఏదో లోపమున్నదని తెలియుచున్నది. భాషాలిపి అక్షరములనెంచగా పంచాక్షరి షష్టాక్షరి మంత్రముగా కనిపిస్తున్నది. పూర్వపు పెద్దలు ఆరు అక్షరముల మంత్రమును ఐదక్షరముల మంత్రమని ఎందుకు చెప్పారను ప్రశ్న ఉద్భవించుచున్నది.

పంచాక్షరీ మంత్రముయొక్క పూర్వపరాలు యోచిస్తే, పూర్వపు జ్ఞానులు విశేషమైన అర్థముతో ఈ పంచాక్షరిని నిర్మించారని తెలియుచున్నది. ఇపుడున్న అన్ని మంత్రములకంటే మొదటిమంత్రము పంచాక్షరీ మంత్రము. పంచాక్షరీ మంత్రము వచ్చిన కొంతకాలమునకు మరి కొందరు మిగతా మంత్రములను సృష్టించినట్లు తెలియుచున్నది. మొదట పంచాక్షరీమంత్రమును తయారుచేసినవారి భావమెట్లున్నదనగా! క్షరమనగా నాశనమగునదని అర్థము. అట్లే అక్షరమనగా నాశనముకానిదని అర్థము. దీనిప్రకారము చూస్తే పంచాక్షరి అనగా పంచమునకు నాశనముకానిదని అర్థము. పంచమునకు నాశనముకానిదేదని యోచిస్తే

'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ' అని భగవద్గీతలో చెప్పబడి ఉన్నది. ఓం అనునది అక్షరమని అనగా నాశనముకానిదని అదియే దైవమని అర్థమగుచున్నది. అందువలన పంచాక్షరీ మంత్రములో 'ఓం' అనునదే దైవమనబడుచు పంచమునకు నాశనముకానిదని తెలియుచున్నది. పంచమనగా ఏమిటన్న మాటకు వస్తే.

ప్రకృతి పరమాత్మలనబడు ఈ సృష్టిలో తెలియునదంతా ప్రకృతియే. కంటికి కనిపించక అంతటా ఆవహించి ఉండునది పరమాత్మ. ప్రకృతి ఐదుభాగములుగా విభజింపబడి ఉన్నది. (1) ఆకాశము (2) గాలి (3) అగ్ని (4) నీరు (5) భూమి. ఐదు భాగములుగా ఉన్న ప్రకృతిలోనే సర్వజీవరాసులు చస్తూ పుట్టుచూ ఉన్నవి. పంచభూతములకు అన్ని జీవరాసులు నాశనమగునవిగ ఉన్నవి. ప్రత్యక్షముగ మనము చూస్తూనే ఉన్నాము. గాలి చెలరేగితే ఎంత భీభత్సమైన చేయగలదు. ఎందరి ప్రాణాలనైన హరించగలదు. అట్లే నీరు చెలరేగిన అందరిని జలసమాధి చేయగలదు. ప్రకృతిలోని ఐదు భాగములు సర్వజీవరాసులను ఒకే ఒక్క క్షణములో హరించి వేయగలవు. కాని ఈ ఐదు తమను సృష్టించిన పరమాత్మను ఏమిచేయలేవు. సర్వజీవరాసులను నశింపజేసి నట్లు పరమాత్మను నశింపచేయలేవు. ఆ విషయమును ప్రజలకు తెలియజేయుట కొరకు పూర్వపుజ్ఞానులు **పరమాత్మకు భాషా లిపిలో ఒక బీజాక్షరమును సృష్టించి దానిని 'ఓం' అన్నారు. అట్లే ప్రకృతిలోని ఐదుభాగములకు ఐదు బీజాక్షరములు తయారుచేసినారు. అవి వరుసగ ఒకటి ఆకాశమునకు 'న' అని, రెండు గాలికి 'మః' అని, మూడు అగ్నికి 'శి' అని, నాలుగు నీరుకు 'వా' అని, ఐదు భూమికి 'య' అని, ఉంచారు. పంచభూతములకు గల పంచబీజాక్షరములు 'నమః శివాయ' అని ఆనాడు అందరికి తెలుసు.** పంచబీజాక్షరములలోనే మొదటి రెండక్షరములను ఒకపదముగా చివరి మూడక్షరములను ఒకపదముగా నమః శివాయ అనడములో కూడ అర్థముగలదు. పంచభూతములలో కంటికి కనిపించని ఆకాశము, గాలి రెండుగలవు. అందువలన వీటిరెండు బీజాక్షరములు-నమః ను ఒకపదముగా కంటికి కనిపించునవి అగ్ని, నీరు, భూమి మూడుగలవు. కావున వాటి బీజాక్షరములైన శివాయ అను ఒకపదముగా పలుకుచూ 'నమః శివాయ' అన్నారు. ఈ విధముగా పలుకుటవలన అందరికి వాటి తారతమ్యము తెలియునను భావముతో ఆనాటి పెద్దలలా ఉంచారు.

ఇంతవరకు పంచభూతములకు గల బీజాక్షరములైన 'నమః శివాయ'ను గురించి తెలుసుకొన్నాము. అట్లే పంచభూతములకు నాశనముకాని దైవమును 'ఓం' అను బీజాక్షరముగా పూర్వపుపెద్దలు గుర్తించిన విషయమును తెలుసుకొన్నాము. పంచభూతములకు దైవము ఒక్కడే నాశనముకాడు కనుక ఆ విషయము మానవులందరికి తెలియునట్లు 'ఓం' అనునది నాశనము కానిదని తెలుపుచూ, అది ఏమిటికి నాశనముకాదో తెలియునట్లు 'ఓం నమః శివాయ' అను వాక్యమును చూపించారు. దైవమొక్కడే పంచభూతములకు నాశనము కానివాడని దీని అర్థము. అందువలన ఓంకారమును ఒక్క దానినే పంచాక్షరి అనెడివారు. పంచమునకు నాశనముకానిదని పంచాక్షరి అని ఓంకారమునే పూర్వము భావించెడివారు. ఓంకారమును అక్షరము అనగా నాశనము కానిదని పిలిచెడివారు. దేనికి నాశనము కానిదను అర్థములేక పోవునని పూర్తి వివరమిచ్చునట్లు పరమాత్మ బీజాక్షరమైన 'ఓం' ను పంచభూతముల బీజాక్షరములైన 'నమః శివాయ' ముందు పెట్టి మొత్తము ఆరు అక్షరములు వ్రాసి పంచాక్షరి అన్నారు. లెక్కించగా ఆరు అక్షరములే అయినప్పటికి దానిపేరు పంచాక్షరియేననీ, ఓంకారమే పంచాక్షరియనీ, పంచాక్షరిలో విశేషమైన అర్థమిమిడి ఉన్నదని తెలియాలి.

పూర్వము ఈశ్వరలింగ ప్రతిష్ఠాపనయే మొట్టమొదటి దేవాలయము. అది పురాణములలో చెప్పుచున్న శంకరుని శాపగ్రస్త ప్రతిమకాదనీ, ప్రకృతి పరమాత్మకు గుర్తింపుగా పెట్టినదనీ, అది ఈ కాలంలో శంకరుని ప్రతిమగా అందరనుకొని పూజిస్తున్నారనీ, అట్లు చేయుట వలన పూర్వపుజ్ఞానులు ఏ ఉద్ధేశ్యముతో ఆ ప్రతిష్ఠ చేశారో ఆ ఉద్ధేశ్యమును మనము పూర్తిగా విస్మరించామనీ, వాస్తవముగా ఆనాడు గల భావము కాలక్రమమున మారినదనీ, పూర్వము లింగము పరమాత్మ గుర్తుగా తలచెడివారనీ, మా రచనలలో చాలామార్లు చెప్పాము. పూర్వము లింగప్రతిష్ఠ విషయము అందరికి తెలిసినదై ఉండెడిది. వారు అక్కడకు పోయి లింగమును చూచి, పంచభూతములకు నాశనముకాని పరమాత్మ అను భావముతో, పరమాత్మ పంచభూతములకు నాశనము కానివాడను భావము పలుకునట్లు బీజాక్షరములైన 'ఓం నమః శివాయ' అని పలికి నమస్కరించి వచ్చెడివారు. బీజాక్షరములు నోటిద్వారా పలుకుటవలన అది మంత్రముగా, పంచాక్షరి మంత్రముగ పేరుగాంచినది. ఆ పంచాక్షరి మాత్రమే నేడు గలదు. కాని పూర్వపు మనుషుల భావమునకు నేడుగల మనుషుల భావమునకు ఎంతో తేడా కనిపిస్తూనే ఉన్నది.

నేడు భగవద్గీతలో కూడా ఓం అనునది అక్షరమనీ, అదియే దైవమనీ, అదే గీతలో అక్షరమనగా నాశనము కానిదనీ అర్థమగు నట్లు తెలియబరచబడినది. అయినప్పటికి ఓం అనునది దైవమేయైతే, ఆ దైవము దేనికి నాశనము కాదు, మనమంతా దేనికి నాశనమగుచున్నామని ప్రశ్నించుకొంటే, ఆ గీతలోనే ప్రకృతియైన పంచభూతములయందే సమస్త జీవరాసులు పుట్టుచూ చచ్చుచున్నవనీ, జీవరాసులను చంపునది పుట్టించునది ప్రకృతియే నేను నిమిత్తమాత్రునిగా చూచుచున్నాననీ, ప్రకృతి అంతా నాశనమైనప్పటికి నేను నాశనముకానివాడననీ, జవాబు దొరుకుచున్నది. అలాంటపుడు పంచమునకు అక్షరమైనది పంచాక్షరియని సులభముగా అర్థము కాగలదు. కానీ నేడు మనము యోచించడము లేదు. కావున అన్ని విషయములు మరుగునపడినవి.

పూర్వము పంచాక్షరి మంత్రమొక్కటియే ఉండెడిది. అపుడు ఇతర మంత్రములు లేవు. కాలము జరిగిపోవుకొలది పంచాక్షరి మంత్ర ప్రభావము తెలియకపోగా, మరికొంత కాలమునకు మనుజులలోనే కొన్ని తెగలు ఏర్పడి పంచాక్షరీ మంత్రము శైవులదను వాడుకవచ్చెను. తర్వాత వచ్చిన వైష్ణవులు మనకొక మంత్రము కావాలని ' ఓం నమో నారాయణాయ' అని సృష్టించుకొన్నారు. అట్లే ఎందరో ఎన్నో మంత్రములు తయారు చేయగ ఈనాడు కొన్ని ఉన్నవి. ఎన్ని ఉన్నా అన్నిటికంటే మించిన మంత్రము పంచాక్షరియేనని తెలియాలి. అది కూడ దాని అర్థము తెలిసినపుడే అది అన్నింటికంటే అధికమని తెలియును కనుక 'ఓం నమః శివాయ' అన్న వాక్యములోని అర్థము పూర్తి అవగాహన చేసుకోండి. క్రొత్తదంతా చెప్పి మమ్ములను గందరగోళము చేయుచున్నాడని నన్ను తిట్టుకోకండి. తెలియనిది తెలుసుకోవడములోనే ఉంది సారాంశమని గమనించండి.

| ఓం | న | మః | శి | వా | య |
|---|---|---|---|---|---|
| \| | \| | \| | \| | \| | \| |
| పరమాత్మ | ఆకాశము | గాలి | అగ్ని | నీరు | భూమి |